


అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక



అనంతపురం 5
శ్రీ సత్యసాయి
గురువారం 30 జూలై 2026

# ఎల్‌నినో కరవు పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలి
# అధికారులకు బిసి సంక్షేమ,చేనేత శాఖ మంత్రి ఆదేశం

పుట్టపర్తి, జూలై 29 (అనంత ప్రభ)
ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుని పనిచేయాలని రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత శాఖ మంత్రి ఎస్. సవిత అధికారులను ఆదేశించారు.

జిల్లా కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్ నందు కరవు నివారణ చర్యలు, తాగునీటి సరఫరా, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల సంసిద్ధతపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్,జాయింట్ కలెక్టర్ ఎం మౌర్య భరద్వాజ్ ,పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లే సింధూర రెడ్డి , కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్,ఎమ్మెల్సీ శివరామిరెడ్డి పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మంత్రి గారు మాట్లాడుతూ...
ఎల్‌నినో కరవు పరిస్థితుల ఎదుర్కొనికి అధికారులు సమన్వయంతో పనిచేయాలి.సూపర్ ఎల్‌నినో కరవు ప్రభావంపై అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి జిల్లా వ్యాప్తంగా తాగునీటి సమస్య, పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి.మంత్రి సవిత అన్ని శాఖల అధికారులు సమగ్ర ప్రణాళికతో కరవు పరిస్థితులను ఎదుర్కోవాలి.జిల్లా వ్యాప్తంగా ఎక్కడా కూడా ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా గ్రామీణ మంచి నీటి సరఫరా (=ఔా) అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలి. సమస్యాత్మక గ్రామాలను ముందే గుర్తించి, అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా ఉచితంగా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలి. చేతిపంపుల మరమ్మతులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు.కరవు కాలంలో మూగజీవాలకు పశుగ్రాసం, తాగునీటి కొరత లేకుండా చూసేందుకు పశుసంవర్ధక శాఖ అధికారులు సైలేజ్, ఎండుగ్రాసాన్ని అందుబాటులో ఉంచాలి. పశుగ్రాస క్షేత్రాల పెంపకాన్ని ప్రోత్సహించడంతో పాటు ఉచిత టీకాల కార్యక్రమాన్ని నిర్వహించాలి.
ఉపాధి హామీ పథకం (వీ+చీ=జు+టా) కింద కూలీలకు క్రమం తప్పకుండా పనులు కల్పించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలను నిరోధించేలా ఉపాధి పనులను వేగవంతం చేయాలని, సమయానికి వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖల అధికారులు




సమన్వయంతో ప్రతివారం గ్రామస్థాయి పరిస్థితులను సమీక్షించుకోవాలి. కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి ప్రజాఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని స్పష్టం చేశారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...
జిల్లాలో ఎల్‌నినో ప్రభావం వల్ల నీటి కొరత లేదా కరవు పరిస్థితులు తలెత్తకుండా ప్రభుత్వం మరియు గౌరవ మంత్రివర్యుల ఆదేశాల మేరకు సమగ్ర ప్రణాళికను రూపొందించాం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై నిరంతరం సమీక్షిస్తున్నాం. ఎండ తీవ్రత, భూగర్భ జలాల మట్టాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్న గ్రామాలను ముందుగానే గుర్తించాం. బోర్ల రీబోరింగ్, పైప్‌లైన్ మరమ్మతులను వేగవంతంగా పూర్తి చేస్తున్నాం. అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ఏర్పాట్లు సిద్ధం చేశాం.కరవు ఉపశమన చర్యల్లో భాగంగా రైతులకు ఉపాధి హామీ పనులు, మూగజీవాలకు పశుగ్రాసం కొరత రాకుండా అన్ని శాఖలను సమన్వయం చేస్తున్నాం.

ఈ సమావేశంలో జిల్లా వివిధ శాఖల అధికారులు, డివిజనల్ అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు

## గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం



హిందూపురం , జూలై 29 (అనంత ప్రభ)
భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, 157-హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి ఢ శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎమ్. మౌర్య భరద్వాజ్ గారి అధ్యక్షతన ఈరోజు హిందూపురం తహశీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పై గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.


ఈ నెల 24.07.2026 నాటికి ఎస్ ఐ ఆర్-2026 కార్యక్రమం 100% డిజిటైజేషన్‌తో విజయవంతంగా పూర్తయిందని తెలిపారు. ఈ ప్రక్రియలో సహకరించిన రాజకీయ పార్టీలకు, బూత్ లెవల్ ఏజెంట్లకు మరియు ఓటర్లకు జాయింట్ కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.మరణించిన ఓటర్లు, శాశ్వతంగా నివాసం మార్చుకున్నవారు, డూప్లికేట్ నమోదులు మరియు గైర్హాజరైన ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించడంలో బి ఎల్ ఏ అందించిన సహకారాన్ని అభినందించారు.

హిందూపురం శాసనసభ నియోజకవర్గంలో నమోదైన వివరాలు:
మరణించిన ఓటర్లు: 12,445
శాశ్వతంగా నివాసం మార్చుకున్నవారు: 8,514
డూప్లికేట్ నమోదులు: 9,860
గైర్హాజరైన ఓటర్లు: 14,864
ఇతరులు: 30
మొత్తం గణన పత్రాలు అందని ఓటర్లు: 24,450
వివిధ ఫారమ్‌ల వినియోగం పై సూచనలు:
18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా దరఖాస్తులు చేసుకొనుటకు కింద తెలిపిన ఫారమ్‌లను వినియోగించుకోవాలని తెలిపారు:
ఫారమ్ - 6: కొత్తగా ఓటరు నమోదు కొరకు.ఫారమ్ - 7: మరణించిన/అనర్హులైన ఓటర్ల పేర్లను తొలగించుటకు.ఫారమ్ - 8: ఓటరు జాబితాలోని వివరాల సవరణ మరియు ఒక పోలింగ్ కేంద్రం నుండి మరొక పోలింగ్ కేంద్రానికి మార్పు కొరకు.

ఈ సమావేశంలో హిందూపురం తహశీల్దార్ జి. వెంకటేష్
మునిసిపల్ కమిషనర్ వి. మల్లికార్జున లేపాక్షి తహశీల్దార్ జి. సౌజన్యలక్ష్మి, చిలమత్తూరు మండల తహశీల్దార్ ఎ.పి. లక్ష్మీనారాయణ ఎన్నికల డిప్యూటీ ఎమ్. మహేష్ మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ బి. అమరేంద్ర, సూపరింటెండెంట్లు, ఎన్నికల ఆపరేటర్లు మరియు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా శ్రీషిరిడి సాయిబాబా గురు పౌర్ణమి మహోత్సవం







- కూడేరు లో భక్త శ్రద్ధల నడుమ గురు పౌర్ణమి వేడుక
- భక్తులతో కిటకిటలాడిన షిరిడి సాయిబాబా ఆలయం
- సనాతన ధర్మమే భక్తీ మార్గం ఆలయ ట్రస్ట్ చైర్మన్ రజిత రెడ్డి

కూడేరు, జులై 29 (అనంత ప్రభ)
కూడేరు మండల కేంద్రంలోని బుధవారం రోజున గురు పౌర్ణమి పురస్కరించుకుని ఆలయ ట్రస్ట్ చైర్మన్ రజిత రెడ్డి శ్రీ శ్రీ షిరిడి సాయిబాబా కు ఉదయాన్నే పాలాభిషేకం పంచామృత అభిషేకం, అలంకరణ,,అర్చన మహానైవేద్యం , మం-
-మంగళహారతి పల్లకి సేవ రాహు కాలం పూజలో భాగంగా కుజదోష కాలసర్పదోష సర్పదోష నివారణ కొరకు ప్రత్యేక హోమాలు పూజలు నిర్వహించారు.ఈ గురు పౌర్ణమి వేల భక్తుల సుదూర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో కిటికీడలాడిపోయింది. భక్తులు స్వామివారి ఈ అభిషేకం, హోమము యందు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీ సాయిబాబా ను దర్శించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ చైర్మన్ మాట్లాడుతూ ఆధ్యాత్మికంగా సనాతన ధర్మామే భక్తి మార్గమని మానవుడు సనాతన ధర్మాన్ని పాటించినప్పుడే మనిషిలోని అజ్ఞానం తొలగి జ్ఞానం తేజోవంతమై... దైవం మానవ రూపంలో అవతరిస్తుందని ఆమె అన్నారు. షిరిడి సాయిబాబా నామాన్ని జపించినచో సకల కష్టాలు తొలగిపోయి ఆరోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించగలడని అదియే గురువు యొక్క ప్రధానమైన మార్గమని ఆమె అన్నారు. మనిషి నిత్యజీవితంలో ఏ కార్య సిద్ధిని సాధించాలన్నా గురువు లేనిదే ఎటువంటి కార్య సిద్ధిని సాధించలేమని గురువును నిరంతరం ధ్యానిస్తూ సేవిస్తూ ఆరాధించడం వల్లే దైవమార్గాన్ని పొందగలమని శ్రీ షిరిడి సాయిబాబా సేవించినచో సకల పాపాలు తొలగి ప్రశాంతమైన జీవితాన్ని గడపగలమని భక్తుల యొక్క హితం కోరడమే గురువు యొక్క ప్రధాన మార్గమని ఆలయ ట్రస్ట్ చైర్మన్ రజితా రెడ్డి అన్నారు. ఈ గురు పౌర్ణమి భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా శ్రీషిరిడి సాయిబాబా సన్నిధి నందు పెద్ద ఎత్తున అన్న ప్రసాద కార్యక్రమాలను నిర్వహించారు

## మాదక ద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యం

పుట్టపర్తి, జూలై 29 (అనంత ప్రభ)
మాదక ద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల పంపిణీ, వినియోగాన్ని అరికట్టడానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. యువత మరియు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు.

బుధవారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎస్పీ ఎన్కార్డ్ కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మరియు ఎస్పీ మాట్లాడుతూ...
రైల్వే శాఖ అధికారులు, రైల్వే పోలీస్ మరియు సివిల్ పోలీసు విభాగాలతో కలెక్టర్ సమావేశమయ్యారు. రైళ్ల ద్వారా జరిగే గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను సమర్థవంతంగా అరికట్టేందుకు సంయుక్త తనిఖీలు చేపట్టాలని, నిఘాను తీవ్రతరం చేయాలని ఆదేశించారు."నశాముక్త విద్యాలయ అభియాన్" కార్యక్రమంలో భాగంగా మరియు 2026--29 నూా త్రీవత్సర కార్యాచరణ ప్రణాళిక అనుసరించి విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పాఠశాలలు, కళాశాలల నిర్దేశిత పరిధిలో గుట్కా, సిగరెట్లు, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల విక్రయాలను పూర్తిగా నిరోధించాలని



ఆదేశించారు.జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ మరియు పాలిటెక్నిక్ కళాశాలలు సోషల్ మీడియా వేదికగా మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. ఈ విక్రయాల అడ్డుకట్టకు పోలీసు శాఖకు విద్యాసంస్థలు పూర్తి సహకారం అందించాలని కోరారు.యువతను మాదక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడుకోవడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో డిటిఓ కరుణ సాగర్, పోలీస్, రవాణా , చీనూ×, =ఒదీ, వైద్య ఆరోగ్య శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు

## ప్రజలకు సేవ చేయడం కోసమే పనిచేస్తా..ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, జూలై 29 (అనంత ప్రభ)
అనంతపురం జిల్లాలోనే అత్యంత వెనుకబడిన నియోజకవర్గమైన కళ్యాణదుర్గంను అన్ని రంగాల్లోను అభివృద్ధి చేయడం, ప్రజలకు సేవ చేయడం కోసం పనిచెస్తానని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు పేర్కొన్నారు.నేడు రెండవ రోజు శెట్టూరు మండలం చిన్నబలపంపల్లి గ్రామంలో రెండేళ్ల కూటమి పాలనలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు, ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు చేపట్టిన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు, మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు..ఈ సందర్బంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలను అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరిస్తానని, త్వరలోనే కొత్త పింఛన్లు మంజూరు అవుతాయన్నారు..గ్రామాల్లో గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్య పాలన కారణంగా ఎక్కడి సమస్యలు అక్కడే ఆగిపోయాయని ఇప్పుడు వాటిని పరిష్కరించడమే పనిగా పెట్టుకున్నామని



తెలిపారు..అలాగే గ్రామం నుంచి పొలాలకు వెళ్లే దారి వంకలో చాలా ఇబ్బందిగా ఉందని చెప్పడంతో అక్కడ పైపులతో కల్వర్టును వారంలోగా వేయించి సమస్య పరిష్కరిస్తానని, గ్రామంలో మారెమ్మ ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణం కోసం తన స్వంత నిధులు 50,000 రూపాయలు అందజేశారు..అనారోగ్య బాధితుడికి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించారు..అనంతరం ములకలేడు గ్రామంలో టీడీపీ నాయకులు ఎమ్మెల్యే గారిని ఘజమాలతో ఘనంగా సన్మానించగా అక్కడే మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాల వేయడం జరిగింది.

## డీఎస్సీ హామీని నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం--ప్రతిపక్ష ఆరోపణలు నిరాధారం : మాన్వి దేవేంద్రప్ప

ఆదోని, జూలై 29 (అనంత ప్రభ)
రాష్ట్రంలో డీఎస్సీ ఉద్యోగాల భర్తీ ద్వారా ఎన్నికల హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని ఏపీ స్టేట్ కురుబ--కురుమ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప అన్నారు. 2024 ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే దాదాపు 16 వేలకుపైగా డీఎస్సీ పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. అదేవిధంగా 6 వేల కానిస్టేబుల్ పోస్టులను కూడా భర్తీ చేసి యువతకు ఉపాధి కల్పించిందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో ఉపాధి కల్పనకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని కొనియాడారు. డీఎస్సీ నియామకాలపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని, న్యాయస్థానం కూడా వాటిని సమర్థించలేదని అన్నారు. అయినప్పటికీ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.



2019 నుంచి 2024 వరకు ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా నిరుద్యోగులను నిరాశపరిచిన వారే ఇప్పుడు విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. డీఎస్సీపై అనుమానాలు ఉంటే బహిరంగ చర్చకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సిద్ధమని ప్రకటించారని, ప్రతిపక్ష నాయకులు కూడా చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలే ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు ఉపాధి కల్పన నిరంతరం కొనసాగుతోందని మాన్వి దేవేంద్రప్ప పేర్కొన్నారు



## వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు



యాడికి, జులై 29 (అనంత ప్రభ)
గురుపౌర్ణమి సందర్భంగా యాడికి మండలంలోని నగరూరు, రాయలచెరవు, యాడికి మండల కేంద్రంలోని శ్రీ సాయిబాబా ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య సాయిబాబాకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు వైభవంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు సాయినాథుని దర్శించుకుని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఆలయ ప్రాంగణాలు సాయి నామస్మరణ, భజనలతో మార్మోగగా భక్తిశ్రద్ధలు వెల్లివిరిశాయి పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేయగా, వేలాది మంది ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా యాడికి సీఐ శ్రీనివాసులు, ఎస్సై గోపాల్ ఆధ్వర్యంలో పోలీసులు ఆలయాల వద్ద బందోబస్తు నిర్వహించారు

## ఈ నెల 31 తో పంటల బీమా గడువు ముగింపు



యాడికి, జూలై 29 (అనంత ప్రభ)
ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు తప్పనిసరిగా పంటల బీమా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాష పిలుపునిచ్చారు. వాతావరణ ఆధారిత పంటల బీమా నమోదు గడువు ఈ నెల 31వ తేదీతో ముగియనున్నందున రైతులు ఆలస్యం చేయకుండా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం వాతావరణ ఆధారిత పంటల భీమా కింద వేరుశనగ, పత్తి పంటలు ఉన్నాయని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సాధారణం కంటే తక్కువగా కురిసే అవకాశం ఉండటంతో బీమా పరిహారం లభించే అవకాశాలు అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. రైతులు చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా వెంటనే తమ పంటలను బీమా పరిధిలోకి తీసుకువచ్చి ప్రభుత్వ కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాష విజ్ఞప్తి చేశారు

## సంక్షేమమే లక్ష్యంగా ఇంటింటికి ప్రచారం



యాడికి, జులై 29 (అనంత ప్రభ)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటికీ ప్రచార కార్యక్రమంలో భాగంగా యాడికి మండల కేంద్రంలోని సంత మార్కెట్‌లో టీడీపీ సీనియర్ నాయకుడు గొర్తి రుద్రమ నాయుడు ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ప్రజలకు వివరించారు.
ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు, వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని రుద్రమ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూపునేని రాజశేఖర్, దామినేని నరసింహ చౌదరి, నంద్యాల రంగస్వామి, చింత శివశంకర్, తెల్లాకుల వెంకటేష్, తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు

## అగాపే వృద్ధాశ్రమంలో అన్నదానం



యాడికి, జూలై 29(అనంత ప్రభ)
యాడికి మండల కేంద్రములోని రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే వృద్ధాశ్రమములో బుధవారం యాడికి సీపీఐ సీనియర్ నాయకుడు, టింబర్ డిపో యజమాని జూటూరు బషీర్ తన మనవడు అయాన్ షహజద్ పుట్టినరోజు సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులు, నిరాశ్రయులకు అన్నదానం నిర్వహించారు. మనవడు అయాన్ షహజద్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటూ ఆశ్రమంలో ప్రత్యేక విందు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆశ్రమానికి వంట కోసం రెండు ట్రాక్టర్ల కట్టెలను కూడా అందజేశారు. గతంలో కూడా పలుమార్లు ఆశ్రమానికి కట్టెలు అందించి తన సేవాభావాన్ని చాటుకున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అగాపే ఆశ్రమ వ్యవస్థాపకుడు బత్తల ప్రసాద్‌తో పాటు ఆశ్రమంలోని వృద్ధులు జూటూరు బషీర్ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అయాన్ షహజద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, అతను ఆయురారోగ్యాలతో, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు

## శ్రీ పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



యాడికి జూలై 29 (అనంత ప్రభ)
ఆషాఢ మాస గురుపౌర్ణమి సందర్భంగా యాడికి మండల కేంద్రంలోని శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయంలో బుధవారం పౌర్ణమి పూజలను ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవతో ప్రారంభమైన కార్యక్రమంలో గంగపూజ, పంచామృతాభిషేకం, నూతన పట్టు వస్త్రాల సమర్పణ, కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించి అమ్మవారిని శాకాంబరి అలంకరణగా అలంకరించారు. పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అల్పాహారంతో పాటు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. గురుపౌర్ణమి వేడుకలను యాడికి శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో విజయవంతంగా నిర్వహించారు

## బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరు వ్యక్తులపై కఠిన చర్యలు



హిందూపురం , జూలై 29 (అనంత ప్రభ)
జిల్లా ఎస్పీ శ్రీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు, పెనుకొండ సర్కిల్ సీఐ శ్రీ రాఘవన్ మరియు పెనుకొండ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రజా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది.

ఈ నేపథ్యంలో,
పి. రాజశేఖర్, వయస్సు 36 సంవత్సరాలు, తండ్రి: పి. పరమేశ్వరప్ప, ఇంటి నెం. 2-28, బీసీ కాలనీ, మావటూరు గ్రామం, పెనుకొండ మండలం.
టి. మోహన్, వయస్సు 36 సంవత్సరాలు, తండ్రి: వెంకటేష్, ఇంటి నెం. 2/89-ఎన్, బీసీ కాలనీ, మావటూరు గ్రామం, పెనుకొండ మండలం.

అను ఇద్దరు వ్యక్తులు క్రిమినల్ కేసులలో ముద్దాయిలు గా ఉంది భవిష్యత్తులో ఎటువంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండేందుకు బైండోవర్ చేయబడి ఉండినారు.

అయితే,బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించినందున ఆ విషయాన్ని పెనుకొండ మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ మరియు తహశీల్దార్ శ్రీమతి స్వాతి గారికి నివేదించగా, సంబంధిత వ్యక్తులకు బాండ్ ఉల్లంఘనపై నోటీసులు జారీ చేసి వివరణ కోరారు. వారు సరైన వివరణ ఇవ్వడంలో విఫలమైనందున, బాండ్ ఫోర్ఫీచర్ చర్యల్లో భాగంగా ఒక్కొక్కరికి రూ. 25,000/- చొప్పున జరిమానా విధించడం జరిగింది

## గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న పెద్ద కడుబూరు విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు



మంత్రాలయం , జూలై 29 (అనంత ప్రభ)
కడప జిల్లా కందిమల్లయ్యపల్లెలోని కాలజ్ఞాని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠంలో గురుపౌర్ణమి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకల్లో పెద్ద కడుబూరు మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు, శ్రీశ్రీ పెద్ద లక్ష్మమ్మ దేవి--చిన్న లక్ష్మమ్మ దేవి ఆలయ పూజారి నరసింహాచారి దంపతులు, కేశవాచారి దంపతులు, వీరన్నాచారి దంపతులు పాల్గొని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకుని ఆశీర్వాదాలు పొందారు. అనంతరం తోటపల్లిలోని శ్రీశ్రీ అచలానంద ఆశ్రమాన్ని సందర్శించి అక్కడ కులమత భేదాలు లేకుండా నిరంతరం నిర్వహిస్తున్న శ్రీ అచలానంద నిత్య అన్నదాన సత్రం సేవలను అభినందించారు. ఈ సందర్భంగా దివంగత ఉమాశంకరాచారి కుటుంబ సభ్యులు లలిత, నరసింహాచార్యులు అన్నదాన కార్యక్రమానికి విరాళం అందజేశారు. అనంతరం శ్రీశ్రీ అచలానంద నిత్య అన్నదాన సమాజం అధ్యక్షులు, పీఠాధిపతి పూజ్య శ్రీశ్రీశ్రీ వీరాజానంద స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో కమ్మరి రామకృష్ణాచారి, భీమేశాచారి, కేశవాచారి, ఈరన్నాచారి, నరసింహాచారి కుటుంబ సభ్యులు, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు, గురువందనం, హారతి అనంతరం నిత్య అన్నదాన సేవలో పాల్గొని గురువుల ఆశీర్వాదాలు పొందారు. గురుపౌర్ణమి సందర్భంగా నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం భక్తి, సేవాభావం, సామాజిక సామరస్యానికి ప్రతీకగా నిలిచింది

## సంజీవని పథకం రాష్ట్ర ఆరోగ్యరంగానికి మైలురాయి--గడ్డా ఫక్రుద్దీన్
## ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలన్నదే సీఎం చంద్రబాబు సంకల్పం



ఆదోని, జూలై 29 (అనంత ప్రభ)
రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సంజీవని పథకం ఆరోగ్యరంగంలో చారిత్రాత్మక మార్పులకు నాంది పలుకుతుందని టీడీపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి గడ్డా ఫక్రుద్దీన్ అన్నారు. బుధవారం ఆదోనిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంజీవని పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్యసేవలు చేరువ కానున్నాయని తెలిపారు. ప్రస్తుతం చిన్నచిన్న అనారోగ్య సమస్యలకే ప్రజలు వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొందని, పేద, మధ్యతరగతి కుటుంబాలపై వైద్యభారం పెరిగిందన్నారు. ఇలాంటి సమయంలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన సంజీవని పథకం ప్రజలకు గొప్ప వరంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యసేవలను ఒకే నెట్‌వర్క్‌లో అనుసంధానం చేసి ప్రజలకు తమకు నచ్చిన ఆసుపత్రి, నచ్చిన వైద్యుడి వద్ద చికిత్స పొందే అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో సేవలు అందుబాటులో ఉండడం వల్ల గ్రామీణ ప్రజలకు కూడా అత్యాధునిక వైద్యం చేరువవుతుందని చెప్పారు. ఆగస్టు నుంచి పథకం అమలులోకి రానుండగా కర్నూలు జిల్లా ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దీనిని ప్రారంభించడం జిల్లాకు గర్వకారణమని అన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఆరోగ్యశ్రీకి మరింత బలాన్ని చేకూర్చే విధంగా సంజీవని పథకం రూపొందించబడిందని వివరించారు. రెండేళ్లలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలుమార్లు కర్నూలు జిల్లాను సందర్శించి అభివృద్ధి కార్యక్రమాలకు ఊతమిచ్చారని తెలిపారు. అదేవిధంగా ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌కు గడ్డా ఫక్రుద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు.

## రెండేళ్లలో అభివృద్ధి--సంక్షేమంలో కూటమి ప్రభుత్వం చరిత్ర సృష్టించింది
## ప్రజల విశ్వాసమే ప్రభుత్వానికి అతిపెద్ద బలం: గుడిసె ఆది కృష్ణమ్మ



ఆదోని, జూలై 29 (అనంత ప్రభ)
రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న “2 ఏళ్ల నమ్మకం--అభివృద్ధి, సంక్షేమం” డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నామని కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు నేరుగా వివరించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఆదోని పట్టణంలోని మండగిరి పంచాయతీ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ పారదర్శకమైన, ప్రజాకేంద్రిత పాలనను అందిస్తోందని పేర్కొన్నారు. మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు, వృద్ధులు, నిరుపేదలు సహా సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అనేక ప్రజాహిత పథకాలను అమలు చేస్తోందన్నారు. అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తోందని తెలిపారు. రెండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ విజయాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లి ప్రజలకు వాస్తవాలను వివరించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆమె పిలుపునిచ్చారు. ప్రజల విశ్వాసమే కూటమి ప్రభుత్వానికి అతిపెద్ద బలమని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని మరింత ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బెస్త ఓంకార్, అబ్దుల్, బజారప్ప, మల్లికార్జున, బంగారు బాబు, సుంకయ్య, భరత్, చంద్ర, బసవరాజు, విజయ్, నాగరాజు తదితరులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆత్మకూరు లో ఇంటింటి ప్రచార కార్యక్రమం



ఆత్మకూరు, జులై 29 (అనంత ప్రభ)
రాప్తాడు నియోజకవర్గం ఆత్మకూరు గ్రామం నందు రాష్ట్రతెలుగుదేశం పార్టీ మరియు శాసన సభ్యురాలు పరిటాల సునీతమ్మ ఆదేశాల మేరకు బుధవారం రోజు ఆత్మకూరు మండలం కేంద్రంలో తెలుగుదేశం పార్టీ ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు పతెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలుహాజరై పాల్గొని ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఆత్మకూరు మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు, హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి శశాంక్ చౌదరి,క్లస్టర్ ఇంచార్జ్ వెంకట్ నారాయణ, కందల ఓబులపతి, రామదాసు, అక్కులన్న, ఆత్మకూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు ఏకాంతం, కోక్ కన్వీనర్ మనోహర్, బూత్ కన్వీనర్ ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## కూడేరు లో అంగన్వాడి కేంద్రాలను తనిఖీ చేసిన డాక్టర్ బి.ఎన్ శ్రీదేవి



కూడేరు, జూలై 29 (అనంత ప్రభ)
కుడేరు మండలం లో కూడేరు 1,2,3,4 సెంటర్స్ సీడీపీఓ డాక్టర్ బి.ఎన్ శ్రీదేవి అంగన్వాడి కేంద్రాలను తనిఖీ చేశారు. అంగన్వాడి కేంద్రాలలో కార్యకర్తలు ఆయాలకు అవగాహన కల్పించారు.
1.0 నుండి 6 సంవత్సరాల పిల్లల కు స్క్రీనింగ్ చేయాలని ప్రతి సెంటర్లో ఫోర్ కార్నర్ పెట్టాలి.ప్రీస్కూల్ పిల్లలు యాక్టివిటీస్ చేయించాలని
ప్రీస్కూల్ పిల్లలు అందరూ హాజరు అయ్యేటట్టు చూడాలని అలాగే గ్రోత్ కరెక్ట్ గా తీసి ఆన్లైన్ చేయాలని తక్కువ బరువు ఎత్తులు వున్నా పిల్లల గృహ సందర్శిన కి వెళ్లి తల్లులకు సమూతుల్య ఆహారం అందించాలని బయట ఫుడ్ పెట్టాకూడదని టి హెచ్ ఆర్ ఐవిఆర్ఎస్ కాల్స్ గురుంచి చెప్పడం జరిగింది.ప్రతి సెంటర్స్ లో ముస్తాబు పెట్టాలి. ఇండక్షన్ స్టవ్ వాడాలని అలాగే కౌమర దశలో గర్భధారణ గురించి చిన్న వయసులో పెళ్ళి చేసుకోకూడదాని చేసుకుంటే వచ్చే నష్టాల గురించి తల్లులకు అవగాహనా ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో సీడీపీఓ డాక్టర్ బి ఎన్ శ్రీదేవి, సూపర్ వైజర్ సురేఖ, అంగన్వాడీ వర్కర్స్ తల్లులు పాల్గొన్నారు

## శ్రీ విజయాంబిక అమ్మవారికి ఘనంగా సారె సమర్పణ



యాడికి, జూలై 29 (అనంత ప్రభ)
యాడికి బైరవ కొండపై వెలసిన శ్రీ విజయాంబిక సమేత భైరవలింగేశ్వర స్వామి ఆలయంలో ఆషాఢ పౌర్ణమి సందర్భంగా శ్రీ విజయాంబిక అమ్మవారికి భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో సారె సమర్పించారు. ఈ సందర్భంగా వడిబియ్యం, పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, పట్టు వస్త్రాలు తదితర మంగళ ద్రవ్యాలను అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాడికి పట్టణ పురవీధుల గుండా భాజా భజంత్రీల నడుమ భక్తులు శోభాయాత్రగా ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సారెను అర్పించారు. దాదాపు వందలాది మంది భక్తులు పాల్గొని వివిధ రకాల నైవేద్యాలను సమర్పించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని శ్రీ భైరవలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. శోభాయాత్రలో మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి పారవశ్యంతో అమ్మవారిని కీర్తిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## విజన్ విద్యాసంస్థల సేవాభావం, భక్తుల ప్రశంసలు



యాడికి, జూలై 29 (అనంత ప్రభ)
యాడికి మండల కేంద్రంలోని శ్రీ సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమంలో దాదాపు 5,000 మందికి పైగా భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి బాబా ఆశీస్సులు పొందారు. ఈ సేవా కార్యక్రమంలో యాడికి విజన్ విద్యాసంస్థల విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొని అన్నప్రసాద పంపిణీతో పాటు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సేవలందించారు. అలాగే విజన్ విద్యాసంస్థల యాజమాన్యం మండల కేంద్రం నుంచి సాయిబాబా ఆలయం వరకు భక్తుల కోసం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ఏర్పాటు చేసి సేవాభావాన్ని చాటుకుంది. విద్యార్థుల సేవా దృక్పథం, యాజమాన్యం కల్పించిన ఉచిత రవాణా సౌకర్యంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తూ విజన్ విద్యాసంస్థల యాజమాన్యానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. గురు పౌర్ణమి సందర్భంగా ఆలయంలో భక్తిశ్రద్ధల నడుమ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి

AP 4PG 30- 7- 2026 THURSDAY qxp_Layout 1 29-07-2026 09:12 PM Page 3











## కరివేపాకుని ఇలా తింటే షుగర్ ఉన్నవారికి మంచిదట..



కరివేపాకు ఆరోగ్యానికి నిజంగా చాలా మంచిది. అంతేకాకుండా, దీనిని వాడడం వల్ల జుట్టు సమస్యలు కూడా దూరమవుతాయని చెబుతున్నారు నిపుణులు. దీనిని అనేక రకాలుగా తీసుకుంటాం. కరివేపాకు పచ్చడి, వంటల్లో వాడడం, కరివేపాకు రైస్ ఇలా ఎన్నో రకాలుగా వాడతాం. దీంతో ఆరోగ్యంతో పాటు జుట్టుకి హెల్ప్ చేస్తుంది. అయితే, జుట్టు రాలడాన్ని దూరం చేసేందుకు కరివేపాకుని ఎలా వాడాలో ఇప్పుడు చూద్దాం.

జుట్టు ఆరోగ్యానికి..

కరివేపాకు జుట్టు రాలడాన్ని తగ్గించడమే కాకుండా నెరసిపోవడాన్ని కూడా దూరం చేసి జుట్టు పెరిగేలా చేస్తుంది. ఇక మైగ్రేన్ వంటి తలనొప్పులని కూడా దూరం చేస్తుంది. దీంతో పాటు రక్తంలో చక్కెర స్థాయిలను దూరం చేసి బరువు తగ్గడానికి హెల్ఫ్ చేస్తుంది. హార్మన్ల సమస్యల్ని దూరం చేస్తుంది.

జుట్టుకి కరివేపాకు..

కరివేపాకు హెయిర్ మాస్క్, హెయిర్ ఆయిల్‌ని వాడడం వల్ల చుండ్రు, జుట్టు రాలడం, తెల్లబడడం వంటి సమస్యలన్నీ దూరమవుతాయి. దీంతో పాటు జుట్టు పెరిగేలా చేస్తుంది.

చుండ్రు దూరం..

కరివేపాకుని మిక్సీ పట్టి మజ్జిగలో కలిపి పేస్టలా చేయండి. దీనని తలకు పట్టించాలి. ఆరిపోయాక నీటితో కడగాలి. వారానికి రెండు, మూడు సార్లు ఇలా చేస్తే సమస్య దూరం..

నోటి దుర్వాసన..

చాలా మందికి అనేక కారణాలతో నోటి నుండి దుర్వాసన వస్తుంది. అలాంటి సమస్యకి కరివేపాకుతో చెక్ పెట్టొచ్చు. దీని కోసం 5 తాజా కరివేపాకులని తీసుకుని 5 నిమిషాల పాటు నమలాలి. తర్వాత మీ నోటిని నీటితో క్లీన్ చేసుకోండి. దీంతో నోటి దుర్వాసన దూరం.

బ్లడ్ షుగర్ లెవల్స్ కంట్రోల్..

షుగర్ పేషెంట్స్‌కి కరివేపాకు బాగా హెల్ప్ చేస్తుంది. దీనిని చట్నీలా చేసుకుని తినడం, వారి డైట్‌లో యాడ్ చేసుకోవాలి. కరివేపాకులోని ఫ్లేవనాయిడ్స్ బాడీలోని కార్బోహైడ్రేట్స్ నుండి గ్లూకోజ్‌కి జీవక్రియను నిరోధిస్తాయి. దీంతో రక్తంలో చక్కెర నిల్వల్ని నియంత్రించడంలో సాయపడతాయి.

## మీ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచే.. ఆహారాలు ఇవే..!



జీర్ణ సమస్యలు సాధారణంగా.. అనారోగ్యకరమైన ఆహారం, నిశ్చల జీవనశైలి కారణంగా ఎదురవుతూ ఉంటాయి. మనం తీసుకునే ఆహారాన్ని జీర్ణం చేయడంతోపాటు.. శరీరానికి అవసరమైన పోషకాలను శోషించుకొని వ్యర్థాలను బయటకు నెట్టేయడంలో జీర్ణవ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుంది. జీర్ణవ్యవస్థ సరిగ్గా పని చేయకపోతే.. మలబద్ధకం, యాసిడ్ రిఫ్లక్స్, ఎసిడిటీ, గ్యాస్, అజీర్ణం, త్రేనుపు, గుండెల్లో మంట, ఇరిటేటబుల్ బౌల్ సిండ్రోమ్ వంటి సమస్యలు ఎదురవుతాయి. జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో, పనితీరును మెరుగుపరచడంలో కొన్ని ఆహార పదార్థాలు సహాయపడతాయి. మీ జీర్ణ వ్యవస్థను రక్షంచే ఆహారాలు ఏమిటో తెలుసుకోవాలంటే.. ఈ స్టోరీ చదివేయండి.

పెరుగు..

మీ జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని పెంపొందించే మరో అద్భుతమైన ఆహారం పెరుగు. పెరుగులోని ప్రోబయోటిక్స్ గట్ మైక్రోబయోమ్ సమతుల్యతను మెరుగుపరుస్తుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మనం తీసుకున్న ఆహారం సులభంగా జీర్ణమై, కడుపుబ్బరం వంటి సమస్యలను దూరం చేసే మంచి బ్యాక్టీరియాను ఉత్పత్తి చేయడంలో పెరుగు సమర్థంగా పనిచేస్తుంది. దీన్ని ఆహారంలో భాగం చేసుకుంటే.. జీర్ణక్రియ సాఫీగా జరిగి, తేన్పులతో పాటు ఇతర జీర్ణ సంబంధిత సమస్యలు దూరం అవుతాయి.

అల్లం..

వికారం, ఉబ్బరం, అజీర్ణం వంటి జీర్ణ సమస్యలకు చికిత్స చేయడానికి అల్లాన్ని ఎన్నో శతాబ్దాలుగా వాడుతున్నారు. అల్లంలో జింజెరోల్స్, షోగోల్స్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి జీర్ణవ్యవస్థలో మంటను తగ్గిస్తుయి. జీర్ణక్రియను ప్రోత్సహించడలో సహాయపడతాయి. అల్లం జీర్ణవ్యవస్థలోని కండరాలను సడలించడంలో సహాయపడుతుంది. ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలను నివారిస్తుంది. రోజుకు రెండు లేదా మూడు సార్లు చిన్న అల్లం ముక్కను తీసుకోవడం వల్ల తేన్పుల సమస్య నుంచి ఉపశమనం పొందచ్చు.

ఓట్స్..

ఓట్స్‌లో కరిగే ఫైబర్ మెండుగా ఉంటుంది. ఇది పేగు కదలికలను నియంత్రించడంలో, మలబద్ధకాన్ని నివారించడంలో సహాయపడుతుంది. కరిగే ఫైబర్ ఫైబర్ పేగులో జెల్ లాంటి పదార్థాన్ని ఏర్పరుస్తుంది, ఇది జీర్ణవ్యవస్థ ద్వారా ఆహార మార్గాన్ని నమ్మెదిస్తుంది. దీంతో.. శరీరం పోషకాలను మరింత సమర్థవంతంగా గ్రహించుకోగలదు.

బొప్పాయి..

బొప్పాయిలో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. పాపైన్ ప్రొటీయోలైటిక్ ఎంజైమ్, అంటే ఇది జీర్ణవ్యవస్థలో ప్రోటీన్లను విచ్ఛిన్నం చేయడానికి సహాయపడుతుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడానికి సహాయపడుతుంది. ఇది గ్యాస్, ఉబ్బరం, గ్యాస్ వంటి జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేస్తుంది. బొప్పాయిలో ఫైబర్ ఉంటుంది, ఇది ప్రేగు కదలికలను నియంత్రిస్తుంది. మలబద్ధకాన్ని దూరం చేస్తుంది.

పుదీనా..

పుదీనా.. ఉబ్బరం, అజీర్ణం, వికారం వంటి జీర్ణ సమస్యలకు చికిత్స చేయడానికి ఔషధంలా పనిచేస్తుంది. పుదీనాలో.. జీర్ణాశయ కండరాలను సడలించడానికి సహాయపడే సమ్మేళనాలు ఉంటాయి. ఇది ఉబ్బరాన్ని నివారించడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో తోడ్పడుతుంది. పుదీనా జీర్ణవ్యవస్థలో మంటను తగ్గిస్తుంది, ఇరిటేటబుల్ బౌల్ సింద్రోమ్ సమస్యను పరిష్కరిస్తుంది.

## తీపి పదార్థాలు తినాలన్న కోరిక పెరిగిపోతోందా? అయితే జాగ్రత్త ఈజీ..రుచేసుకోవచ్చు

తీపి పదార్థాలను తినాలన్న కోరిక అందరికీ ఉంటుంది. కాస్త తీపి తిన్నాక ఆ కోరిక తగ్గిపోతుంది. కానీ కొందరికి రోజురోజుకి తీపిగా ఉండే పదార్థాలను తినాలన్న కోరిక ఎక్కువైపోతూ ఉంటుంది. అలా తీపి ఆహారాల కోరిక పెరుగుతుందంటే అంటే భవిష్యత్తులో కొన్ని రకాల మానసిక సమస్యలు వచ్చే అవకాశం ఉందని చెప్పే ఒక హెచ్చరికగా భావించాలి. అల్జీమర్స్ వ్యాధి... జ్ఞాపకశక్తి, ఆలోచన , సామాజిక సామర్థ్యాలను ప్రభావితం చేస్తుంది. తీపి ఆహారం తినాలన్న కోరిక అధికంగా ఉన్నవారికి సమీప భవిష్యత్తులో ఈ అల్జీమర్స్ వ్యాధి వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు అధ్యయనకర్తలు. దీన్నే డిమెన్షియా అని కూడా అంటారు. డిమెన్షియా అంటే చిత్త వైకల్యం అని కూడా చెప్పుకోవచ్చు. ఇది మెదడులోని వ్యక్తిత్వం, ప్రవర్తన, మాట తీరు గురించి పని చేసే భాగాలపై ప్రభావం చూపిస్తుంది. ఇది మెదడులో ఫ్రంట్ టెంపోరల్ లోబ్స్‌లో ఉన్న న్యూరాన్లకు నష్టం కలిగేలా చేస్తుంది. నిజానికి ఈ సమస్య 40 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల మధ్య ఉన్న వ్యక్తులకు వస్తుంది. ఇలాంటివారు తీపి పదార్థాలు తినాలన్న కోరిక పెరుగుతుంటే, తినకుండా తమను తాము నియంత్రణలో ఉంచుకోవడం చాలా ముఖ్యం.



ఏమిటీ లింక్?

అమెరికా నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ చెబుతున్న ప్రకారం ఆహారంపై ఉన్న ఆసక్తికి, డిమెన్షియా వచ్చే అవకాశానికి మధ్య బంధం ఉంది. ప్రవర్తనలో మార్పులు, తీపి పదార్థాలను అధికంగా కోరుకోవడం వంటి వన్నీ కూడా డిమెన్షియా రాకకు సంకేతాలుగా చెబుతున్నారు. అతిగా తినడం, అతిగా మద్యం సేవించడం, తినేటప్పుడు మర్యాదలు పాటించకపోవడం వంటివి కూడా భవిష్యత్తులో డిమెన్షియా వచ్చే రాకను సూచిస్తున్నట్టే. ఇవే కాదు ఇంకా అనేక లక్షణాలు ఉన్నాయి. తదేకంగా చూడడం, వ్యక్తులతో అధికంగా మాట్లాడడం, చేసే పనిపై దృష్టి పెట్టలేకపోవడం, చేసిన పనే పదేపదే చేయడం వంటివి కూడా భవిష్యత్తులో ఈ వ్యాధి రాకకు సూచనలే.

చికిత్సజి

ఈ వ్యాధికి చికిత్స లేదు. అయితే లక్షణాలను మాత్రం మందుల ద్వారా తగ్గించవచ్చు. వైద్యులు ఈ వ్యాధి బారిన పడిన వారికి యాంటీ డిప్రెసెంట్స్ ఇస్తుంటారు. ఇది అతిగా తినడం, విచిత్ర ప్రవర్తనలను తగ్గించడానికి సహాయపడతాయి. అలాగే ఫిజియోథెరపీని కూడా సూచిస్తారు. స్పీచ్ థెరపీ ద్వారా కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరచడానికి ప్రయత్నిస్తారు. ఏది ఏమైనా అతి స్వీట్లు తినడం మాత్రం ఆరోగ్యానికి అనర్ధదాయకం

## ఈ డ్రింక్స్ ఉదయం పూట తాగితే.. అందమైన మెరిసే చర్మం మీ సొంతం..!



ప్రకాశవంతంగా మెరిసే ముఖం కావాలని ప్రతి ఒక్కరికీ ఉంటుంది. ముఖ్యంగా అమ్మాయిలకు ఈ కోరిక బలంగా ఉంటుంది. ఐతే, ప్రస్తుత లైఫ్‌స్టైల్, కాలుష్యం, ఒత్తిడి, రేడియేషన్ కారణంగా.. చర్మ సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. మొటిమలు, బ్లాక్ హెడ్స్, టాన్, వైట్ హెడ్స్ వంటి సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి, అందమైన ముఖం సొంతం చేసుకోవడానికి ఏవేవో క్రీమ్‌లు వాడతారు, ట్రీట్మెంట్స్ తీసుకుంటూ ఉంటారు. కొంతమంది న్యాచురల్ ప్యాక్స్‌తో ఈ సమస్యలకు చెక్ పెట్టాలనుకుంటారు. అయితే, చర్మానికి బయట నుంచి క్లీన్ చేయడం, పోషకణ అందించడం ఎంత ముఖ్యమో.. లోపలి నుంచీ అంతే కేర్ తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. మిలమిల మెరిసే చర్మం కావాలంటే.. దాన్ని డిటాక్స్ చేయడం చాలా ముఖ్యం. మీ చర్మం మెరుస్తూ ఉండేందుకు ప్రతి రోజూ ఉదయం తాగాల్సిన కొన్ని డిటాక్స్ డ్రింక్స్ చూసేయండి.

పసుపు టీ..

పసుపులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ వంటి వివిధ ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది మన చర్మంపై మొటిమలను తొలగించడానికి, గాయాలను నయం చేయడానికి సహాయపడుతుంది. పసుపు చర్మం మంట, చికాకు వంటి సమస్యలను పరిష్కరిస్తుంది. పసుపు టీ తాగడానికి ఒక గ్లాస్ నీళ్లలో అర స్పూన్ పసుపు వేసి 5 నిమిషాల పాటు మరిగించండి. ఆ తర్వాత స్టవ్ ఆఫ్ చేసి... కొంచెం నిమ్మరసం, తేనె కలిపి గోరువెచ్చగా తాగలి. ఇలా రోజూ ఉదయం తాగితే.. స్పాట్ లెస్ బ్యూటీ మీ సొంతం.

విటమిన్ సి డ్రింక్స్..

విటమిన్ సి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. విటమిన్ సి శరీరంలోని కెమికల్ టాక్సిన్స్ నుంచి శరీరాన్ని రక్షిస్తుంది. విటమిన్ సిలో యాంటీ ఏజింగ్ గుణాలు ఉంటాయి. ఇది ఫ్రీరాడికల్స్ నుంచి చర్మ కణాలను రక్షిస్తుంది. వృద్ధాప్య ఛాయలను నివారిస్తుంది. విటమిన్ సి డ్రింక్ తయారు చేయడానికి.. రాత్రి పూట మీకు కావలిసినంత నీటిలో నిమ్మ, పైనాపిల్ , కివీ, ఆరెంజ్ సహా మీకు నచ్చిన సిట్రస్ పండ్లు వేసుకోవచ్చు. ఈ నీటిని ఉదయం పూట తాగండి. ఇది శరీరాన్ని, చర్మాన్ని శుభ్రపరిచే బెస్ట్ డిటాక్స్ డ్రింక్ అని చెప్పొచ్చు.

గ్రీన్ జ్యూస్..

ఆకుపచ్చని కూరగాయలు, పండ్లలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్స్ మెండుగా ఉంటాయి. ఇవి చర్మం నుంచి మలినాలను, వ్యర్థాలను తొలిగించి.. చర్మాన్ని డిటాక్స్ చేస్తాయి. దీంతో చర్మం తాజాగా, ప్రకాశవంతంగా మారుతుంది.

ఎలా తయారు చేసుకోవాలి..

పాలకూర, గ్రీన్ యాపిల్, కీరా, చిన్న అల్లం ముక్కను.. మిక్సీ జార్ వేసి కొన్ని నీళ్లు పోసి జ్యూస్‌లా చేయాలి. దీనికి టేస్ట్ కోసం కొంచెం నిమ్మరసం యాడ్ చేసుకోవాలి. ప్రతి రోజూ ఉదయం ఈ జ్యూస్ తాగితే.. చర్మమే కాకుండా శరీరం మొత్తం డిటాక్స్ అవుతుంది.

దానిమ్మ జ్యూస్..

దానిమ్మలోని యాంటీఆక్సిడెంట్లు చర్మంలోని మలినాలను తొలగిస్తాయి. చర్మానికి తాజాదనం, మెరుపును అందిస్తాయి. దానిమ్మలోని లైకోపీన్ మంచి రంగును ఇస్తాయి. వృద్ధాప్య ఛాయలు త్వరగా రాకుండా నివారిస్తుంది. మిమ్మల్ని యవ్వనంగా ఉంచుతుంది. ఉదయం పూట దానిమ్మ జ్యూస్ తాగితే.. మీ చర్మంలోని మలినాలు తొలగి ఫ్రెష్‌గా ఉంటుంది.

పుచ్చకాయ, తులసి జ్యూస్..

పుచ్చకాయ, కీరా, తులసి జ్యూస్ బెస్ట్ డిటాక్స్ డ్రింక్ అని చెప్పవచ్చు. ఇది చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. చర్మంలో నూనె స్రావాన్ని సమతుల్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. పుచ్చకాయలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ మైక్రోబియల్ గుణాలు చర్మాన్ని యవ్వనంగా ఉంచుతాయి. కీరా, పుచ్చకాయలో.. పొటాషియం కంటెంట్ శరీరంలో అదనపు సోడియంను గ్రహించడంలో సహాయపడుతుంది. దీని వల్ల చర్మం హైడ్రేట్‌గా ఉండి.. మెరుస్తూ ఉంటుంది.

అరకప్పు పుచ్చకాయ, సగం దోసకాయ, కొద్దిగా తులసి వేసి బాగా గ్రైండ్ చేసి జ్యూస్‌ను ఫిల్టర్ చేయాలి. దీనిలో కాస్త నిమ్మరసం కలిపి.. ఉదయం పూట తాగితే చర్మం మెరుస్తుంది.

# టాలీవుడ్ డైరెక్టర్‌తో డేటింగ్ రూమర్స్? ఆ హీరోతో రిలేషన్‌లో ఉన్నానంటూ హీరోయిన్ ట్విస్ట్!





చిత్ర పరిశ్రమలో బ్యాచిలర్ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తున్న నటీనటులంతా ఒక్కొక్కరిగా మ్యారేజ్ లైఫ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నా. టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు ఈ ట్రెండ్ కొనసాగుతోంది. ఎప్పటి నుంచో ప్రేమాయణం సాగిస్తున్న అమ్మాయిలంతా తమ పార్టనర్స్, కాబోయే భర్తలను పరిచయం చేస్తున్నారు. తాజాగా ఈ లిస్ట్‌లోకి తమిళ నటి బ్రిగిదా సాగా ఎంట్రీ ఇచ్చారు. ఈ వివరాల్లోకి వెళితే..

తమిళనాడుకు చెందిన బ్రిగిదా సాగా.. తొలుత ఆహా కళ్యాణం అనే తమిళ సీరియల్‌లో పవి టీచర్‌గా బాగా ఫేమస్ అయ్యారు. ఈ పాపులారిటీతో సినీరంగం నుంచి ఆమెకు అవకాశాలు వచ్చాయి. 2019లో అయోగ్య అనే సినిమాతో వెండితెర మీదకి అడుగుపెట్టారు బ్రిగిదా. ఆ తర్వాత వర్మా, మాస్టర్ సినిమాలలో నటించారు. వెళన్, ఇరవిన్ నిజాల్, గరుగన్, కొజిపణ్ణై చెల్లాదురై, మార్గాన్, ఇడ్లీ కడాయ్, హాట్ స్పాట్ సినిమాలతో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. సింధూరం, పెదకాపు పార్ట్ 1 సినిమాలతో తెలుగు వారిని కూడా ఆకట్టుకున్నారు.

అందరు హీరోయిన్ల మాదిరిగానే బ్రిగిదాపైనా పలు రూమర్స్ వచ్చాయి. ప్రధానంగా తెలుగు డైరెక్టర్, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు ఫేమ్ శ్రీకాంత్ అడ్డాలతో బ్రిగిదా రిలేష-న్‌లో ఉన్నారంటూ అప్పట్లో వార్తలు వైరల్ అయ్యాయి. తెలుగు, తమిళ ఇండస్ట్రీలలో వీరి వ్యవహారం చర్చనీయాంశమైంది. శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో తెరకెక్కిన పెదకాపు సినిమాలో బ్రిగిదా సాగా నటించారు. ఈ సమయంలో వీరిద్దరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి ఇద్దరూ రిలేషన్‌లో ఉన్నట్లు గాసిప్స్ వైరల్ అయ్యాయి. అయితే ఇద్దరిలో ఎవరూ దీనిపై స్పందించలేదు.

కానీ తమిళ దర్శకుడు, నటుడు పార్థిబన్ అప్పట్లోనే బ్రిగిదా- శ్రీకాంత్ అడ్డాల వ్యవహారంపై ఘాటు వ్యాఖ్యలు చేస్తూ మీడియాపై మండిపడ్డారు. ఇదంతా ఒట్టిదేనని, వీరిద్దరి మధ్య ఎలాంటి బంధం లేదని తేల్చేశారు. శ్రీకాంత్ సతీమణి రాగసుధను తానే కోలీవుడ్‌కి పరిచయం చేశానని, ఇలాంటి వాటిని ఆమె అస్సలు పట్టించుకోదేదని పార్థిబన్ తేల్చేశారు. దాంతో శ్రీకాంత్ అడ్డాల- బ్రిగిదాల రిలేషన్ వార్తలకు చెక్ పడింది. ఇద్దరూ ఎవరి సినిమాలతో వారు బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో బ్రిగిదా సాగా సైలెంట్‌గా షాకిచ్చారు. తాను ఒకరితో రిలేషన్‌లో ఉంటున్నానని, ప్రియుడితో ఉన్న ఫోటోను షేర్ చేశారు.

తమిళ నటుడు, యువ హీరో అనంత్ రామ్‌తో తాను రిలేషన్‌లో ఉన్నట్లు తాజాగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వెల్లడించారు బ్రిగిదా. నా చిన్నప్పుడు అందమైన ప్రేమకథలు కేవలం సినిమాలలో ఉంటాయేమో అనుకునే దానిని, కానీ జీవితం నా కోసం అద్భుతమైన, అందమైన కథ రాసింది. నా ఫిలిం జర్నీలో నా లాంటి అభిరుచులు, కలలు ఉన్న అనంత్ నాకు తారసపడ్డాడు. స్నేహంతో మొదలైన మా బంధం ఇప్పుడు ప్రేమ వరకు వచ్చింది. అంతేకాదు.. మేమిద్దరం ఐ లవ్ యూ అని చెప్పుకుని వదిలేసే రకం కాదంటూ బ్రిగిదా రాసుకొచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతుండగా.. సినీ ప్రముఖులు, అభిమానులు, సన్నిహితులు బ్రిగిదా- అనంత్ రామ్ జోడీకి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. త్వరలోనే గుడ్ న్యూస్ చెప్పాలంటూ ఆకాంక్షిస్తున్నారు. అనంత్ రామ్ కూడా చిన్నా చితకా సినిమాలలో ఇప్పుడిప్పుడే నిలదొక్కుకునే యత్నాల్లో ఉన్నాడు.




# హైదరాబాద్‌లో సల్మాన్ ఖాన్ సందడి.. నయనతార ఎంట్రీతో పెరిగిన అంచనాలు!




బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ మోస్ట్ అవేటెడ్ ప్రాజెక్ట్ 'హెంజ63' షూటింగ్ ఈ వారమే హైదరాబాద్‌లో మొదలు కానుంది. ఈ భారీ షెడ్యూల్ కోసం దర్శకుడు వంశీ పైడిపల్లి ఇప్పటికే నగరంలోని కీలక లొకేషన్లను ఫైనలైజ్ చేశారు. సల్మాన్ రాక కోసం ఇక్కడి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. బాలీవుడ్, టాలీవుడ్ కలయికలో వస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తమ నగరంలోనే ఇంత పెద్ద సినిమా షూటింగ్ జరుగుతుండటంతో స్థానిక సినీ ప్రియులు ఖుషీ అవుతున్నారు. షూటింగ్ షెడ్యూల్‌ను పక్కాగా ప్లాన్ చేసిన చిత్ర యూనిట్, ఈ వారాంతంలో పనులన్నీ పూర్తి చేసింది. ఈ సినిమా కోసం లేడీ సూపర్ స్టార్ నయనతార తన బిజీ కాల్ షీట్ నుంచి ప్రత్యేకంగా డేట్స్ కేటాయించారు. ఆమె రాకతో ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌కు మరింత స్టార్ వాల్యూ పెరిగింది. షూటింగ్ స్పాట్స్ దగ్గర ఫ్యాన్స్ రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ పోలీసులు కూడా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. హీరోయిన్ డేట్స్ విషయంలో ఉన్న సస్పెన్స్‌కు ఈ అప్‌డేట్‌తో తెరపడింది.

నగరంలోని ఐకానిక్ లొకేషన్లతో పాటు ప్రైవేట్ స్టూడియోల్లో భారీ యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరించనున్నారు. దాదాపు మూడు వారాల పాటు ఈ షెడ్యూల్ కొనసాగనుంది. సల్మాన్ ఖాన్ లుక్ లీక్ అవ్వకుండా చిత్ర యూనిట్ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటోంది. సినిమా ఫస్ట్ హాఫ్‌కు ఈ షెడ్యూల్ వెన్నెముక లాంటిదని తెలుస్తోంది. ఇప్పటికే స్టంట్ కోఆర్డినేటర్లు, నటీనటులు హైదరాబాద్ చేరుకుని రిహార్సల్స్ మొదలుపెట్టేశారు. షూటింగ్ కోసం సిద్ధమైన నయనతార సల్మాన్ గ్లోబల్ స్టార్‌డమ్, వంశీ పైడిపల్లి మేకింగ్ స్టైల్ కలిసి ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వనున్నాయి. సౌత్ ఇండియన్ నేటివిటీ మిస్ అవ్వకుండా మేకర్స్ ప్రతి ఫ్రేమ్‌ను జాగ్రత్తగా డిజైన్ చేస్తున్నారు. సల్మాన్-నయనతార జోడీ మధ్య కెమిస్ట్రీ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఈ కాంబినేషన్ సౌత్ మార్కెట్‌లో సినిమాకు భారీ ఓపెనింగ్స్ తెచ్చిపెడుతుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. నయనతార ఈ ప్రాజెక్ట్‌లో ఉండటం దక్షిణాది రాష్ట్రాల్లో సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. లోకల్ టెక్నీషియన్లతో సందడి సినిమాకు పక్కా రీజినల్ ఫ్లేవర్ తీసుకురావడానికి చాలా మంది తెలుగు టెక్నీషియన్లు ఈ ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు. వంశీ పైడిపల్లి ఈ చిత్రాన్ని అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో విజువల్ వండర్‌గా తీర్చిదిద్దుతున్నారు. స్థానిక టాలెంట్‌ను ప్రోత్సహించడం ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకత.

# ఆల్ఫా బాక్సాఫీస్ రేస్ ప్రారంభం.. అడ్వాన్స్ బుకింగ్ రెస్పాన్స్ ఎలా ఉందంటే?




బాలీవుడ్ యువ హీరోయిన్లు ఆలియా భట్, శర్వరీ వాఘ్ తమ కొత్త సినిమా 'ఆల్ఫా'తో బాక్సాఫీస్ వద్ద యాక్షన్ మోత మోగించడానికి సిద్ధమయ్యారు. జూన్ 26, 27 తేదీల్లో విడుదలైన కొత్త ప్రోమోలు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. జులై 3న విడుదల కానున్న ఈ సినిమా కోసం దేశవ్యాప్తంగా సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. యష్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో వస్తున్న ఈ చిత్రం ఒక సరికొత్త మలుపుగా నిలవనుంది.

ఈ సినిమాలో ఆలియా, శర్వరీ అత్యంత కఠినమైన పోరాట దృశ్యాల్లో నటించారు. ఒక సూపర్ స్పై పాత్ర కోసం ఆలియా భట్ ఎంతో కష్టపడి శిక్షణ తీసుకుంది. శర్వరీతో కలిసి ఆమె చేసే హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వనున్నాయి. ముఖ్యంగా మహిళా ప్రధాన యాక్షన్ సినిమాలను ఇష్టపడే ఆడియన్స్‌ను ఈ చిత్రం భారీగా ఆకట్టుకోనుంది.

ఆల్ఫా అడ్వాన్స్ బుకింగ్ ట్రెండ్స్.. ఇండియా వైడ్ రిలీజ్ డీటెయిల్స్

జులై 3న థియేటర్లలో ఈ సినిమా సందడి మొదలుకానుంది. ఇప్పటికే బుక్‌మైషో, పీవీఆర్ వంటి యాప్స్‌లో అడ్వాన్స్ బుకింగ్ అలర్ట్స్ కనిపిస్తున్నాయి. ఫస్ట్ డే ఫస్ట్ షో టికెట్ల కోసం ఫ్యాన్స్ అప్పుడే పోటీ పడుతున్నారు. మెట్రో నగరాలతో పాటు టైర్-2 సిటీల్లోనూ ఈ సినిమాపై భారీ హైప్ కనిపిస్తోంది.

ఆలియా భట్ 'ఆల్ఫా' తెలుగు వెర్షన్.. ఏపీ, తెలంగాణ స్క్రీన్ అప్‌డేట్స్

తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ సినిమా గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. హిందీతో పాటు తెలుగు డబ్బింగ్ వెర్షన్ కూడా భారీ ఎత్తున విడుదల కానుంది. హైదరాబాద్, వైజాగ్ వంటి నగరాల్లో ఐమాక్స్ , పీఎక్స్‌ఎల్ వంటి ప్రీమియం స్క్రీన్లలో ఈ సినిమాను వీక్షించవచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ప్రేక్షకులకు వరల్డ్ క్లాస్ విజువల్ ఎక్స్‌పీరియన్స్ అందించేలా ప్లాన్ చేస్తున్నారు.

ఆల్ఫా యాక్షన్ డిజైన్.. స్పై యూనివర్స్‌లో సరికొత్త ప్రయోగం

పఠాన్, టైగర్ సిరీస్ వంటి బ్లాక్ బస్టర్ సినిమాల బాటలోనే 'ఆల్ఫా' కూడా రూపొందింది. అయితే, మహిళా స్పైల కోణంలో కథను నడిపించడం ఈ సినిమా ప్రత్యేకత. భారీ బడ్జెట్, విదేశీ లొకేషన్లు, ఖరీదైన స్టంట్స్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ ఏడాది గ్లోబల్ లెవల్లో స్పై జానర్ సినిమాలకు ఈ చిత్రం కొత్త ఊపునిస్తుందని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఆల్ఫా ఇన్‌స్టాగ్రామ్ ప్రోమోలు.. అప్‌డేట్స్ మిస్ అవ్వకండి

మంచి సీట్లు మిస్ అవ్వకుండా ఉండాలంటే డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో టికెట్ రిమైండర్లు సెట్ చేసుకోవడం మంచిది. లేటెస్ట్ అప్‌డేట్స్, సాంగ్ రిలీజ్ వివరాలు, బిహైండ్ ది సీన్స్ వీడియోల కోసం ఆలియా భట్ అఫీషియల్ ఇన్‌స్టాగ్రామ్ పేజీని ఫాలో అవ్వండి. సినిమా రిలీజ్ కంటే ముందే ఎక్స్‌క్లూజివ్ విషయాలను తెలుసుకోవడానికి ఇది ఫ్యాన్స్‌కు మంచి అవకాశం.

# ది బాయ్ మూవీ రివ్యూ అండ్ రేటింగ్


మర్డర్ కేసులో జైలు శిక్ష అనుభవించిన మేరి లుకా (ఫర్జానా పాలథింగల్) జైలులోనే బిడ్డకు జన్మనిస్తుంది. శిక్షాకాలం పూర్తయిన తర్వాత కొడుకు వాసుదేవ్ (ఆదిశేషన్ కేఆర్)తో కలిసి బయటకు వస్తుంది. తమ ఐడెంటిటీ గురించి తెలియకుండా జాగ్రత్త పడుతూ పలు ప్రదేశాల్లో తలదాచుకొనే ప్రయత్నం చేస్తుంది. ఆ క్రమంలో ఓ వృద్ధురాలి సంరక్షణగా చేరుతుంది. అయితే తన కుటుంబానికి దూరంగా బతుకుతున్న వృద్ధురాలి కోరిక మేరకు చనిపోయిన తర్వాత ఆమె పార్థివ దేహాన్ని తన ఇంటిలోనే పాతిపెడుతుంది. ఈ విషయం తెలుసుకొన్న కొడుకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మేరిని అరెస్ట్ చేస్తారు. ఆ సమయంలో వాసుదేవ్ స్కూల్ వెళ్లడంతో తల్లి నుంచి విడిపోతాడు

మేరీ లుకా ఏ పరిస్థితుల్లో హత్య కేసులో ఇరుక్కొన్నది? మారు పేర్లతో తల్లి కొడుకులు ఎందుకు రహస్య జీవితాన్ని కొనసాగించారు? తమ గతం గురించి కొడుకు ఎలాంటి కథలు చెప్పింది? తల్లికి కొడుకు ఎలా అండగా నిలుస్తాడు? తల్లితో విడిపోయిన తర్వాత వాసుదేవ్ పరిస్థితి ఏమిటి? వాసుదేవ్ ఎలా పెరిగాడు? తల్లిని వెతకడానికి ఎలాంటి ప్రయత్నాలు చేశాడు? తల్లి ఆచూకీ కోసం ఎవరెవర్నీ కలిశాడు? వాసుదేవ్ లైఫ్‌లో అబ్బాస్ (టొవినో థామస్) పాత్ర ఏమిటి? తల్లి, కొడుకు ఎలా కలిశారు? అనే ప్రశ్నలకు సమాధానమే ఈ సినిమా కథ.

తల్లి, కొడుకుల రహస్య ప్రయాణం, ఐడెంటిటీ తెలియకుండా జాగ్రత్త పడటమనే అంశాలతో కథ చాలా స్లోగా సాగుతుంది. ఈ సినిమా సన్నివేశాల్లో డీటెయిలిటీ ఎక్కువ కావడంతో సినిమా కొంత డాక్యుమెంటరీ టచ్ అనిపిస్తుంది. కాకపోతే 70 ఏళ్ల వృద్ధురాలి క్యారెక్టర్ కథలోకి వచ్చిన తర్వాత కొంత ఫన్‌తో సాగడం ఫీల్‌గుడ్‌గా అనిపిస్తుంది. తల్లి, కొడుకులు విడిపోయిన తర్వాత స్టోరీలో ఎమోషన్స్, సెంటిమెంట్ అంశాలు ఎలివేట్ అయ్యేలా చిదంబరం సినిమాను తెరకెక్కించారు. టొవినో థామస్ అతిథి పాత్రలో కనిపించినప్పటికీ.. సినిమా కథకు అంతగా ఉపయోగపడేలా కనిపించదు. కాకపోతే భావోద్వేగంతో సాగే సినిమాగా ఓ హానెస్ట్ అటెంప్ట్ కనిపిస్తుంది. పెర్ఫార్మెన్స్‌కు స్కోప్ ఉన్న సినిమాగా హృదయాలను టచ్ చేస్తుంది. ఈ సినిమాను కొంత ఓపికగా చూడాల్సిన పరిస్థితి ఉంటుంది.

నటీనటుల పెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. ఫర్జానా, ఆదిశేషన్ ఇద్దరు మాత్రమే సినిమాను నిలబెట్టారని చెప్పవచ్చు. వారు తమ పాత్రల్లో జీవించడంతో ప్రతీ సన్నివేశం బాగా పండింది. డిఫరెంట్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌ను ఫర్జానా చాలా సులభంగా, అలవోకగా పోషించారు. చిన్నవాడైనా పిల్లాడు తన వయసుకు మించిన పరిణతితో ఆకట్టుకొన్నారు. మిగితా పాత్రల్లో కనిపించిన వారు తమ క్యారెక్టర్ల డెప్త్ మేరకు ఫర్వాలేదనిపించారు. ఈ సినిమాకు ప్రధానంగా సినిమాటోగ్రఫి, మ్యూజిక్ పూర్తిస్థాయిలో సపోర్టుగా నిలిచాయి. బ్యాక్ గ్రౌండ్ స్కోరు సన్నివేశాలను ఎమోషనల్‌గా మార్చాయి. ఆటవీ ప్రాంతం, గ్రామీణ ప్రాంతంలో సాగే సినిమా కావడంతో పల్లె, అడవి అందాలను చక్కగా కెమెరాలో బంధించారు. సాధారణంగా భారీ బడ్జెట్ సినిమాలను రూపొందించే కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కే నారాయణ తొలి ప్రయత్నంగా కంటెంట్ ప్రధానమైన సినిమాతో రావడం కొంత ఆశ్చర్యం కలిగిస్తుంది. అయితే మంచి ఉన్నత నిర్మాణ విలువలతో ఈ సినిమాను అందించారు. చైల్డ్ డ్రామా, మదర్, సన్ రిలేషన్స్, సైకాలజీ సర్వైవల్ థ్రిల్లర్స్ చూడాలనుకొనే వారికి బాలన్: ది బాయ్ చక్కటి ఆప్షన్. కాకపోతే కొంత ఓపికగా చూస్తే మంచి అనుభూతి కలుగుతుంది.






PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com